కథ 2012

1



# అతడు

## స్కైబాబ

అతడెప్పుడూ అర్థమయ్యేవాడు కాదు!
ఎంతగా అంటే - చివరికి తనను వదిలేస్తాడని అతడి భార్యే నమ్మలేకపోయింది!
నేను కూడా చాలా ఆశ్చర్యపోయాను!

అతడొక ఆలోచనల కర్మాగారం. అతడి వెంటే నీడలా ఉన్నా ఒక్కోసారి అతడు ఎటువైపు దారి తీస్తాడో అర్థంకాక తికమకపడుతుంటాను. సాధారణంగా నా హెచ్చరికలతో సరైన నిర్ణయాలు తీసుకోవాల్సింది పోయి, అతడే ఎంతో దూరదృష్టితో స్థితప్రజ్ఞతతో ముందుకు దూసుకెళ్తుంటే నేనే అతడిని వెంబడించాల్సి వస్తోంది. అసలు నా ప్రబోధం అవసరమే అతడికి రాక పోవడం అతడి మేధోశక్తికి నిదర్శనం. లోకరీతులకు, ఐహిక- ప్రాపంచిక ప్రలోభాలకు లొంగే మనస్తత్వాన్ని అతడు జయించాడు. అందుకే అతడికి నా అవసరం రావడమే లేదు అనుకొని నా ఇగోకి సర్దిచెప్పుకున్నాను.

అతడా నిర్ణయం తీసుకోవడం మాత్రం నన్నే అమితాశ్చర్యానికి గురిచేసింది..!

*

అతడి ఆలోచనలతో ఒకసారి సంవాదం చేస్తు న్నాను. ఎంత డిఫరెంట్‌గా ఆలోచిస్తాడో! అబ్బురమేస్తుం టుంది! కానీ ఎవరితోనూ ఎక్కువగా పంచుకోడు. పంచుకుంటే వెంటనే అతడి ఆలోచనలకు వారు వేయి వంకలు చెప్పి ఆనకట్టలు వేసేస్తుండేవారు. అలా కొన్ని సార్లయాక అతడు ఎవరితోనూ తన ఆలోచనలు పంచు కునేవాడు కాదు. ఒకవేళ మనసు ఆగలేక చెప్పుకున్నా... అవతలివారి అభిప్రాయాల్ని వినేవాడు కాదు, 'ఊఁ' కొడుతూనే! ఒక్కోసారి మాట మార్చేసి వారిని డైవర్ట్ చేసి వారేదో మాట్లాడుతుంటే పట్టించుకోకుంట తన ఆలో చనల్లో తను ఉండేవాడు.

అతడంతే! ఎంత ఇమేజరీ అంటే ఆ ఆలోచనల్లో - మాటల్లో చెప్పలేం. అందరూ ఒకలా ఆలోచిస్తుంటే అతడు భిన్నమైన కోణంలో పయనించేవాడు. అతడి ఆలోచన అర్థం కాగానే అప్పటిదాకా ఉన్న అభిప్రాయం పటాపంచలయ్యేది.

కొత్త వంతెన కట్టినట్లు, కొత్త బొమ్మ వేసినట్లు, కొంగొత్త తీరు కవిత రాసినట్లు, కొత్తరాగం కనుగొన్నట్లు వెరైటీగా ఉండేది అతడి ఆలోచన. నిజంగా ఇలాంటి వాడొకడు ఉండాలి అనిపించేది.

అర్ధరాత్రి మేల్కొన్నాడంటే ఖతం! ఆ నిశీధి రాత్రి అతడి ఆలోచనలు ఏ బ్రేకర్లు లేని గుర్రాల్లా దౌడు తీసేవి. కొత్త కొత్త మజిలీలు కొనుగొనేవి. తెల్లారాక కొత్త పనేదో తను చేయడమో మరొకరికి పురమాయిం చడమో జరిగిపోయేది. అసలు అలా కాదేమో.. ఏదో ఒత్తిడి, అసంతృప్తి, అశాంతికి చెందిన సంఘర్షణేదో అతడిలో మెలి తిరుగుతుండేది. అతడిని మేల్కొల్పి లేపి కూర్చోబెట్టేది. ఒకోసారి అదేమిటో అతడికే అర్థం కాక బేచైన్ అయ్యేవాడు. చివరికి ఏదో తట్టినట్లయి ఆ మిణుగురు మెల్లమెల్లగా ఒక రూపు సంతరించుకునేది. అది రాసేదయితే అదొక రచనగా రూపుదిద్దుకునేది. లేదంటే తెల్లారి ఒక కొత్త కార్యక్రమమై వెలుగు చూసేది. కాదంటే కొత్త ఉద్యమమై మొగ్గ తొడిగేది... అతడలా చుట్టూ జరుగుతున్న ఉద్యమాలన్నింటి లోనూ తనూ భాగమవుతూ... తనలోకి ఆ ఉద్యమాల్నీ భాగం చేసుకుంటూ పయనించేవాడు...

అవాళ- అతడి ఆలోచనలతో సంవాదం చేస్తున్నానని చెప్పాను కదా... అతడి ఆలోచనల్ని అందుకోవాలని తెగ ఆరాటపడడం ఒక వ్యసనమైపోయింది నాకు. అందుకోలేక బోర్లా పడిపోవడం కూడా మామూలైపోయింది. సంవాదంలో ఓడిపోవడమే నాకు నిత్యకృత్యమైపోయింది. ఎప్పుడో ఒకసారి గెలవడం! కాని ఆ గెలుపు సంతోషం ఎంతోసేపు ఉండేది కాదు. ఎందుకంటే అతడు దాన్ని తన ఓటమిగా కాకుండా ఆ విషయాన్ని వెంటనే ఒప్పేసుకొని అందులోంచి ఇంకా ముందుకు వెళ్లే పనిలో ఉండేవాడు. నిరుత్సాహపడిపోవడం నా వంతయ్యేది. వెంటనే తేరుకొని అతనితో పాటు పరుగెత్తడమే సరిపోయేది.

అవాళ అతడి ఆలోచనలతో సంవాదం చేస్తూ చేస్తూ అతడి వేగానికి పరేశానయిపోయి ఎక్కడో స్టక్ అయిపోయాను. భయమేసింది అతడి ఆలోచనకి. తేరుకొని వారించబోయాను. కాని నాలో ఏదో గుంజాటన... అతడు ఆలోచిస్తున్నది ఎంతో సాహసంతో కూడినది. అందులో ఏదో జెన్యూనిటీ ఉందనిపించినా... ఎటూ తేల్చుకోలేకపోయాను. అతడిని వారించడం మాత్రం కష్టం. పైగా అతడి ఆలోచనలో ఈ సిస్టమ్స్‌కి ఒదగని ఫోర్స్ ఉంది. ఓహ్... ఆ ఆలోచనకు ఆచరణ రూపమివ్వడం ఎంత కష్టం!

*

ఆ సమయం రానే వచ్చింది. అవాళ ఏదో చిన్న విషయంలో పెద్ద గొడవైంది. ఇద్దరూ మాటా మాటా అనుకున్నారు. అలా కొట్లాడుకుంటారు, ఎప్పటిలాగే తిరిగి మామూలైపోతారనుకున్నాను.

కానీ ఆమె అన్న మాటతో నేను షాక్‌కి గురయ్యాను.

"లాభం లేదు, మనం విడిపోదాం," అన్నదామె.

ఒకటికి నాలుగుసార్లు 'విడిపోదాం' వెనకా ముందు అనేక మాటలు కలిపి అన్నది. నాలుగుసార్లు అన్న తర్వాత అన్నాడు అతడు-

"సరె, అలాగే విడిపోదాం," అని.

"ఈ ఇంట్లో ఉన్నదంతా నా సామానే. ఒక వ్యాన్ మాట్లాడి అన్నీ ఎక్కించి పంపించు. నేను వెళ్లిపోతాను," అన్నదామె కఠినంగా. అతడు కాసేపు తటపటాయించాడు. వెంటనే వెళ్లి మాట్లాడితే- తర్వాత ఇద్దరూ రాజీకొస్తే- అని అతడి ఆలోచన కావొచ్చు. కానీ ఆమె రెట్టించింది.

"ఆగిపోయావేం? వెళ్లి తీసుకురా!"

"మరి మన బాబు...?" సందిగ్ధంగా ఏదో అనబోయాడు.

"వాణ్ణి నవమాసాలు మోసి- కని- పెంచింది నేను. వాడు నా కొడుకు. నాతోనే వస్తాడు," అన్నది.

అతడు కదిలాడు. నేనతడ్ని వారించబోయాను. అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

'తర్వాత ఇబ్బందులు పడతావు. నువ్వు కూడా మొండితనానికి పోకు,' అన్నాను. అతడు పట్టించుకోలేదు.

పెద్ద వ్యానొకటి, దాంతోపాటు నలుగురు మనుషుల్ని మాట్లాడుకొచ్చాడు. ఆమె సీరియస్‌గా అన్నీ సర్దుకోవడం మొదలుపెట్టింది.

"సామాన్లన్నీ కొంచెం వ్యాన్‌లోకి ఎక్కించు. ఇదొక సాయం చెయ్," అన్నది.

అంతలో బాబు వచ్చాడు బైటినుంచి. వాడికేమీ అర్థంకాలేదు.

"పప్పా! ఏమైంది?" అనడిగాడు.

వెంటనే ఆమె- "అరేయ్! మనం ఊరెళ్లిపోతున్నాం, నీ బట్టలు, సామాన్లు సర్దుకో," అన్నది. వాడు అయోమయంగా చూశాడు.

"ఊఁ! జల్దీ కానీయ్," అని మళ్లీ గద్దించింది ఆమె. వాడు అయిష్టంగా కదిలాడు.

సామాన్లన్నీ అతడు వెంట ఉండి వ్యాన్ ఎక్కించాడు.

ఒకటి రెండు వస్తువులను తీసుకెళ్లొద్దని వారించబోయాడు, ఆమె వినలేదు. ఆ వస్తువులు తాను కొన్నవే అని అతడు వాదించలేదు. హాల్లో, బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్లతో సహా విప్పించి తీసుకెళ్లిపోయింది ఆమె.

చివరికి బాబును దగ్గరికి తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు. గుండెల్లోంచి ఏడుపు తన్నుకొచ్చింది. తమాయించుకున్నాడు.

"పప్పా! రెండ్రోజులాగి నువ్వు కూడా రా పప్పా... నేను ఫోన్ చేస్తాను," అంటూ వాడు ఏడ్వబోయాడు. అతడు వారించాడు.

వ్యాన్ కదిలి వెళ్లిపోతుంటే అతడు ఆమెవైపు చూశాడు. ఆమె కూడా అతడి వైపు చూసి వెంటనే చూపు తిప్పేసుకుంది. అతడు చూస్తూనే ఉండిపోయాడు.

'పన్నెండేళ్ల బంధం!' అనుకోకుండా ఉండలేక పోయాడు.

*

కళ్లనిండా నీళ్లతో ఇంట్లోకి వచ్చాడు అతడు. చూస్తే ఖాళీచేసిన ఇల్లులా- చిందరవందర చెత్తా చెదారంతో నిండి ఉంది.

మిగిలిన సామాను- అంటే అతడి సామాను. ఒక చిన్న టేబుల్‌పై కంప్యూటర్, గోడకు రెండు జతల బట్టలు, ఒక బ్యాగ్, ఒక షెల్ఫ్‌లో ఉతికిన ఒక జత, రెండు లుంగీలు వగైరా! బనీన్ వేసుకునే అలవాటు లేదు కాబట్టి అవి లేవు. బైట మూలన చెప్పులు - అంతే! వంట గదిలో కెళ్లాడు. పాత సామానులా నాలుగు గిన్నెలు పడి ఉన్నాయి. ఒక పాత స్టవ్! విరక్తిగా ఒక నవ్వు బైటికి వచ్చింది...

మనసు బాగా అలసిపోయినట్లుగా ఫీలయ్యాడు. హాల్లోకి వచ్చి చూశాడు. ఇన్నాళ్లు ఒక పక్కగా సెకండ్ హ్యాండ్‌లో కొన్న సింగిల్ కాట్ ఉండేది. దానిపై ఒరిగే వాడు, ఇప్పుడు అది కూడా లేదు.

చెత్తతో పాటు బొద్దింకలు కదులుతున్నాయి. కాసేపు ఒరగాలనిపించింది అతడికి. తలుపు వెనక పొరక మాత్రం ఉంది. తీస్కొని ఖాళీగా ఉన్న సింగిల్ కాట్ స్థలం వరకు పక్కకు ఊడ్చాడు. బెడ్‌రూమ్‌లో పడి ఉన్న ఒక పాత దుప్పటి తెచ్చి కింద పరిచి మెల్లగా ఒరిగాడు. చేతిని తలకింద దిండులాగా పెట్టుకొని వెల్లకిలా పడుకుని ఫ్యాన్‌లేని కప్పుకేసి చూస్తూ ఆలో చిస్తున్నాడు.

ఏ అవకాశం చిక్కినా అతడిని ఓదార్చాలని చూస్తున్నాను నేను.

*

తమ సంసారం మొదలైనప్పటి జ్ఞాపకాలు ఆవరించాయి అతడిని.

మొదటిసారి హైదరాబాద్ వచ్చినపుడు ఒక చాప, ఒక ప్లాస్టిక్ బిందె, రాగి చెంబు, బకెట్, ఒక గ్లాసు, నాలుగు గిన్నెలు, బట్టలు- ఇంతే సామాను. అవన్నీ పోయాయి. వద్దు వద్దంటున్నా టీవీ, వాషింగ్ మెషీన్, బీరువా, మంచాలు, నీళ్ల డ్రమ్, ఫ్రిజ్ వగైరా...

ఇప్పుడవన్నీ మళ్లీ ఖాళీ అయ్యాయి.

'ఈ పరిస్థితిని ఇలాగే మిగుల్చుకోగలడా,' అని అతడు ఆలోచిస్తున్నాడు.

ఎక్కడినుంచి ఎక్కడికి వచ్చాడు తను. బాధితులు- పీడితులు- అణగారిన జాతులైన దళితులు, స్త్రీలు, బహుజనులు, ముస్లింల గురించి... తెలంగాణ గురించే ఆలోచించే తను... ఉద్యమించే తను... మెల్లమెల్లగా సంసారిగా మారిపోసాగాడు. అప్పుడప్పుడు గ్రహించి సర్దుకోబోయినా సంసారం అతడిని తన బోనులోకి లాక్కోసాగింది.

ప్రతిఘటించబోయినప్పుడల్లా పెద్ద గొడవ య్యేది. ఎంత గట్టిగా ప్రతిఘటించబోతే అంత పెద్ద గొడవ...

'నీకు సంసారం చేత కాదు'... 'నీతోటివాళ్లు ఎలా ఎదిగారో చూడు'... -ఎన్నెన్ని సూటిపోటి మాటలో... అన్నీ భరించేవాడు.

ఈసారి ఒక చిట్టి కట్టాలని ఆమె పోరడంతో గొడవ మొదలైంది. ఇప్పటికే డబ్బులు సరిపోవడం లేదు. చిట్టి కడితే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారించబోయాడు. ఆమె వినలేదు.

"వెనుకా ముందు ఏమీలేదు. మనలో ఎవరికన్నా ఏదైనా అయితే ఎవరు దిక్కు?" అని అరిచింది.

"నిజమే కానీ... చేతకానిదే చిట్టి కట్టి తరువాత ఇబ్బంది పడడమెందుకు?" అన్నాడు.

"మరి చేతకానిదానికి పెళ్లెందుకు చేసుకున్నావు? వదిలెయ్!" అంది.

మాటామాటా పెరిగింది. అలా వెళ్లిపోయింది. ఇలా వెళ్లిపోవడందాకా ఇంతకుముందు కూడా కొన్ని సార్లు వచ్చినా అతడే తమాయించుకునేవాడు. ఆమె తిడుతూ ఉంటే అతడే మౌనం దాల్చేవాడు.

ఎప్పుడో ఒకసారి జరిగే గొడవలు, నెలకోసారి జరిగేదాకా వచ్చాయి. ఈమధ్య మరీ ఎక్కువయ్యాయి. ఈ క్రమంలోనే అతడు తీవ్రంగా ఆలోచించడం మొదలుపెట్టాడు. చివరికిలా ఒక అవకాశం వచ్చింది. నిజంగానే దీన్నిలా ఆచరణలో పెడతాడని నేను ఊహించలేకపోయాను...

అతడు ఏదో స్థిరంగా నిర్ణయించుకున్నట్లు లేచాడు.

*

సింగిల్ బెడ్ రూం నుంచి సింగిల్ రూంలోకి మారాడు, నాకెందుకో అర్థం కాలేదు. జీతం తీసుకోగానే ఉద్యోగం మానేశాడు. మరింత ఆశ్చర్యపోయాను. ముఖ్యంగా సెల్ నెంబర్ మార్చేశాడు. దాదాపు 8 ఏళ్ల నుంచి కాపాడుకుంటూ వస్తున్న ఒకే నంబర్ అది. మార్చిపడేశాడు.

పాతమిత్రులు కొందర్ని తనలాగే అంతః సంఘర్షణ మిగిలి ఉన్నవారిని కలిశాడు. కొందరు- పూర్తి టైమ్ కేటాయించకున్నా, సహకారమివ్వడానికి రెడీ- అన్నారు.

ఉద్యమాల్లో చురుగ్గా ఉన్నవాళ్లను తరచూ కలవడం మొదలుపెట్టాడు. తనకు నచ్చినవాళ్లతో ఒక అంతర్గత సమావేశం ఏర్పాటుచేశాడు. తాను ఉద్య మించడానికి మిగిలి ఉన్న స్పేస్‌ను ఉపయోగించు కోవడం మొదలుపెట్టాడు. ఇటు తెలంగాణ అటు బహుజన ఉద్యమ అవసరాన్ని గుర్తించాడు. కొందరు యువకుల్ని ఆలోచనాపరుల్ని ఐడెంటిఫై చేశాడు. చలో... తిరిగి అతడి రూమ్‌లో హల్‌చల్ మొదల యింది. వచ్చేవాళ్లు, పొయ్యేవాళ్లు, చర్చలు, సమా వేశాలు, సభలతో బిజీ అయిపోయాడు.

మళ్లీ పెళ్లికాక ముందరి జీవితం, పెళ్లయినాక కూడా కొన్నేళ్లు సాగిన జీవితం... తిరిగి అతణ్ణి ఆవ రించింది.

మధ్యమధ్యలో ఆమె గుర్తొచ్చేది. బాబు గుర్తొచ్చే వాడు. మనసు బాధతో మెలి తిరిగేది. ఒకోసారి ఏడ్చు కునేవాడు. ఆ సమయంలో ఉద్యమ సాహిత్యం చదువుకునేవాడు. మధ్యలో ఒకటి రెండుసార్లు అతని మానసిక సంఘర్షణ చూశ్లేక ఆమెకు ఫోన్ చేయమని సలహా ఇచ్చాను. అతను నిగ్రహించుకున్నాడు కానీ ఫోన్ చేయలేదు.

కొన్నాళ్లకు ఒక మిత్రుడి ద్వారా తెలిసింది- ఆమె అతని గురించి చాలామందిని వాకబు చేసిందని. దాంతో అతనితో చాలా వాదించాను. అయినా విన లేదు.

*

ఒకరోజు -

అర్ధరాత్రి... మూడు గంటలవేళ అతడికి మెలకువ వచ్చింది. కాసేపు అటూ ఇటూ మసిలాడు. నిద్రపట్టకపోయేసరికి లేచి కూర్చున్నాడు.

మళ్లీ ఏదో ఉద్యమమో, కార్యక్రమమో, రచనో రూపుదిద్దుకుంటుందని.. అదేంటో చూడాలని ఆసక్తిగా ఎదురుచూడసాగాను నేను.

ఏదో రాయాలనుకున్నాడట్లుంది. కాని మనసు సహకరించలేదు. మళ్లీ పక్కమీద ఒరిగాడు. పక్కకి చూస్తే కొన్నేండ్లపాటు తన పక్కనే పడుకొని ఉన్న ఆమె... బాబు గుర్తొచ్చినట్లుంది. కళ్లల్లో మెల్లగా నీళ్లు తిరిగాయి.. కాని తమాయించుకుంటున్నట్లనిపిం చింది.

ఇదే అదను అనుకొని అడిగాన్నేను. ఎన్నాళ్ల నుంచో అడగాలనుకుంటున్న ప్రశ్న- 'ఆమెను, బాబును దూరం చేసుకొని ఏం చేస్తున్నావు నువ్వు? ఇది తప్పు కాదా,' అని.

అతడు కొద్దిసేపు ఆలోచించాడు. ఏం జవా బిస్తాడా అని ఆతృతగా, ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. 'అంతకన్నా పెద్ద ప్రయోజనకరమైన పని చేస్తున్నప్పుడు అర్థం చేసుకోగలిగిన బాధితులైతే తప్పక క్షమిస్తారు.

"తను బతకగలదు, సాధ్యమైతే వేరే పెళ్లి చేసుకో గలదు. ఉద్యోగం చూసుకోగలదు. తనకు కావలసిన రీతిగా ఇంటిని, సంసారాన్ని ఏర్పర్చుకొని నడుపుకో గలదు...

"ఆ మాత్రానికి నేనెందుకు? వేరే ఏ సంసారి అయినా సరిపోతాడు. నేను చేయాల్సిన పని వేరే వుంది!

"ఒక్కరి కోసం నేనప్పుడు నలుగురికి దూరమ య్యాను. ఆ ఒక్కరిని దూరం చేసుకొని నేనిప్పుడు నలుగురికి దగ్గరయ్యాను..!" అన్నాడు.

స్థాణువునై చూస్తూండిపోయాను నేను. అతడి అంతరాత్మగా నేనే ముందుండాలి. కాని ఈసారి కూడా అతడే ముందుండడం నాకు అసూయను, ఆశ్చర్యాన్నీ కలిగించింది. అయినా తేరుకొని అతడిని అభినందించ కుండా ఉండలేకపోయాను!

*

అప్పుడప్పుడూ అనిపిస్తూంటుంది...

'అతడి' దృష్టికోణం నుంచి జరిగిన కథ కదా ఇది... మరి ఆమె దృష్టికోణం ఏమిటో ఆమె అంత రాత్మనూ ఒకసారి ఆరా తీయాలని...!

*నవ్య వీక్లీ, 4 జనవరి 2012*

